# జర్నలిజం

రచన: ముక్కామల కృష్ణారావు.

★

"మూర్తీ! ఇందుకేనా నిన్ను ఇక్కడకు తీసుకువచ్చాను? నా జీవితాన్ని నాశనంచేయడానికేనా నిన్ను రక్షించాను? పిచ్చివాడివై, దిక్కులేని పరిస్థితిలో ట్రైన్‌లో పడివుంటే, నువ్వొక కులీనుడవని పరిస్థితులకు లోబడి అట్లావున్నావని, జాలిపొంది ఇక్కడకు తీసుకువచ్చినందుకు ప్రతిఫలమా ఇది? రాత్రనక పగలనక నీ దగ్గరే కూర్చొని నీకు ఉపచారముచేసి నిన్నురక్షించినందుకేనా నాకీ శిక్ష. చదువుకున్నవాడివని, వేరేసహాయం చేసేవారులేరని, నాతండ్రితో చెప్పి గొప్పఉద్యోగం ఇప్పించాను. నీకళ్లను చూస్తూ, నీ విశాలమైన నుదురును చూస్తూ, నా భావి జీవితాన్ని తలచుకుంటూ స్వర్గసీమలో విహరించేదాన్ని. వెడల్పైన నీచాతీమీద తలను ఆనించుకుని స్వర్గమయ ఆనందాన్ని అనుభవిద్దామని ఉవ్విళ్ళూరాను. నా సౌందర్యాన్ని, యవ్వనాన్ని, వలపును నీకు సమర్పిద్దామని తహతహపడ్డాను. కానీ నా ఆశలు అడుగంటిపోయాయి. నా తీయని కలలు కలలే అయాయి. నా ఆశయాలు అంతరించిపోయాయి. నాలో ఏ లోపాన్ని చూసి నన్ను తృణీకరిస్తున్నావ్ మూర్తి." సుధ కళ్లంట నీటిబిందువులు జలజలరాలాయి. నా హృదయంలో తుపాను చెలరేగింది. సుధను శాంతపర్చడం నా శక్తికి మించిందనిపించింది. సుధ కన్నీటిబిందువులను తుడుస్తూ అన్నాను.

"జరిగిపోయిన నా జీవితాన్ని తెలుసుకుంటే నీవు ఇట్లా నన్ను దూషించవు సుధా."

"జరిగిపోయిన జీవిత పుటలతో నాకు సంబంధంలేదు. జరుగుతున్న జీవితంతో నాకు సంబంధం ఉంది. నాతో తీయగా మాట్లాడుతూ, చల్లని చూపులను ప్రసరింపజేస్తూ నా హృదయంలో ప్రేమజ్యోతిని వెలిగించావ్. ఆశాబీజమును నాటావు. నన్ను వివాహం చేసుకుందుకు నీకు ఇష్టంలేకపోతే నన్ను ఇంతగా ఎందుకు భ్రమపెట్టావ్? నిన్ను నా భర్తగా పొందగలనని నాలోనేను ఎంతగానో మురిసాను. ఎంతగానో ఉప్పొంగి పోయాను. నన్ను ఇలా ఏడిపిస్తే నీకేం లాభం మూర్తీ......"



"నా గత జీవితాన్ని తెలుసుకుంటే నన్ను నిందించవు సుధా. నేను చెప్పబోయే కధను విని నన్ను క్షమిస్తే నీకెంతో కృతజ్ఞుడనై ఉంటాను. లేకపోతే నా జీవితం ఇక్కడితోనే అంతమొందుతుంది.

"ఎటుచూసినాఅంధకారం. అంతాఅయోమయం, నిరాశ, నిస్పృహ. జీవితం మోయలేని బరువయింది. ఎట్లా బ్రతకడం అన్నది పెద్దసమస్య అయిపోయింది. నా జీవితానికి నాకు భయంలేదు. ఎక్కడఉన్నా, ఎక్కడ తిన్నా, ఎటుపోయినా అడిగేవారుండరు. సమాజానికి నాకు సంబంధంఉండదు. ఉన్నా లెక్కచేయకపోయేవాణ్ణి. అవసరం కూడా ఉండకపోను, కాని నామీద ఆధారపడ్డజీవి ఇంకోటుంది. చదువుకున్నవాణ్ణి, నెలకు నూరు రూపాయలు సంపాదిస్తున్న గౌరవంగల బానిసనని, పేరొందిన ఒక జర్నలిస్టునని నా తల్లితండ్రులు నా మెడలువంచి, నేనెంత పోరుపెట్టినా లక్ష్యపెట్టక, పట్టుమని ఇరవై ఏళ్ళయినా దాటని నాకు భార్యఅన్న పేరుతో ఇంకో అమాయకపు జీవిని నా మెడకు గట్టారు. నా సుఖంలో ఆమె సుఖం ఇమిడి ఉంది. నా కష్టాలే ఆమె కష్టాలు. నా ఆపదలే ఆమె ఆపదలు. నా కళ్ళల్లోని ప్రశాంతతను పరికిస్తూ నా విశాలమైన నుదురును చూస్తూ నాభార్య...చిన్నారి శాంత మురిసిపోయేది. తనొక గొప్ప రచయిత భార్యనని గర్వంతో అందరిముందరా తలెత్తుకొనిఉండేది. కాని సమాజంలో చీడపురుగులకు నేనంటే ప్రాణసంకటం. అన్యాయం, దురాచారం అన్న నల్లముసుగులు తొడుక్కున్న పెద్దమనుష్యుల హృదయాల్లో నా కలంపోటు బాకుపోటుల్లా తగిలేవి. వారి దుండగాలను, నీచప్రవర్తనను, అక్రమమును ప్రజలముందు వెల్లడవుతుంటే వారి హృదయాల్లో తుపాను చెలరేగేది. నామీద కక్షవహించి, నా జీవితాన్ని నాశనం చేయడానికి ప్రతీ నిముషం కుట్రలు సాగుతునే ఉన్నాయ్. కానీ నా కలం ఏనాడో సత్యాన్ని అమాయకపు ప్రజల ముందర నిరూపించంది ఉండలేదు. నాకు ధైర్యం, సాహసం, శక్తి ఒక వస్తువుమీద అధారపడిఉన్నాయ్. అది న్యాయం. నా న్యాయప్రవర్తనమీద నాకెంతో విశ్వాసం ఉంది. నేను న్యాయంగా నడుస్తే నాకు ఆ భగవంతుడుకూడ అన్యాయం చేయలేడన్న నమ్మకం ఉంది. అందుకే ఈ చీడపురుగుల చీదరింపులకు చెదిరిపోలేదు నా కలం. కానీ అప్పుడప్పుడు నా శాంతమాటలు నన్ను కలవరపెట్టంది ఉండేవికావు. "ఇట్లా రాస్తుంటే మీకేమి లాభమో చెప్పండి. రాత్రీపగలనక వ్రాస్తున్న వ్యాసాల విలువ, కధలు విలువ ఏమైనా ఉందా? ఒక ఎర్ర రాగిపైసాఐనా మీ కధలు మీకు తెచ్చిఇస్తున్నాయా? సమాజంలో ఉంటూ సమాజాన్నే మరమ్మత్తు చేద్దామంటే మీరు ఎంతదాక సఫలీకృతు


లొత్తాలో ఆలోచించండి. మన ఇరుగుపొరుగు వారికికూడ మనమంటే పడదు. పెద్దమనుష్యు లనిపించుకుంటున్నవారంతా మీమీద కక్షు వహించారు. అందరిలో చెడ్డపడమే కాని మనకు లాభం ఏమీ కనిపించదు. నా మాట విని ఇక ఈకథలు వ్రాయడం మానివేయండి" అన్న శాంత మాటలకు చిరునవ్వు నవ్వేవాణ్ణి. ఆమె అనుభవంలేని అజ్ఞాని అని అనుకునేవాణ్ణి. కాని నా శాంత మాటల్లో ఎంతేనా సత్య ముందని ఇప్పుడు అనుభవమైంది.

'స్త్రీ స్వాతంత్ర్యము' అన్న నా వ్యాసం సమాజాన్ని గడగడ లాడించింది. నేడు యువతులు తమ స్వాతంత్ర్యాన్ని ఎట్లా విని యోగపరుస్తున్నారో, అట్లా విచ్చలవిడిగా సంచరిస్తే వచ్చే పరిణామాలేమిటో కల్పిత ఉదాహరణలతో నా కథలో తెలియబర్చాను. కాని అది నా జీవితాన్ని నాశనం చేస్తుందని అనుకోలేదు. నా కలంను ముక్కలు చేస్తుందని కనుక్కోలేకపోయాను. నన్ను దుఃఖ సాగరంలో నడిసముద్రంలో ముంచివేస్తుం దనుకోలేదు.

"మిమ్మల్ని ఎరస్టు చేస్తున్నాను. మీరు నాతో రావాలి" అన్న పలుకులు చెవిని పడగానే ఉలుక్కుపడ్డాను. ఎరస్టు వారంటు! దేనికి? ఎందుకొరకై? నేనొక దొంగననా? కమ్యూనిష్టుననా? రాజద్రోహుడననా?... కారణం తెలిసిందికాదు. తర్వాత తెలిసింది. సంఘాలను, సంఘసభ్యులను అన్యాయంగా ఉన్నదీ లేనిదీ కల్పించి కథలు రూపంతో వారిని అగౌరవపరిచానని వారు నామీద కేసుపెట్టారు.

కోర్టులో వాయిదాలు పడ్తున్నాయ్. తొలి నాకు సమన్లు కోర్టువారు పంపించినట్లు వాటిని నేను రెఫ్యూజ్ చేసినట్లు ఆ ఘరానా పెద్దమనుష్యులు కోర్టువారిని డబ్బుతో కన్విన్సుచేసి నాకు ఎరస్టు వారంటు ఇప్పించారు.

"పేరుపొందిన పెద్దమనుష్యులను, వారి కుటుంబములను, వారి సంఘాలను నువ్వు అనవసరంగా ఈర్ష్యతో విమర్శిస్తూ వారిని అవమానపరుస్తున్నావని ఈ నలభైమంది సాక్షుల స్టేటుమెంటు ప్రకారం నిరూపించబడ్డది. నీ 'స్త్రీ స్వాతంత్ర్యము' అన్న కథలో ఈపెద్ద మనుష్యులను, వారి కుటుంబాలను చాలా నీచంగా అసభ్యంగా విమర్శించి వారిని సమాజంలో అవమానపర్చావు. కనుక సెక్షన్ 500 ఐ. పి. ప్రకారం నీకు అయిదు వందలు రూపాయలు జుల్మానా, రెండేళ్లు కఠినశిక్ష ఇందుమూలముగా విధించబడ్డది,"



ఆవేళ కోర్టువారి ఫైనల్ జడ్జిమెంటు వినగానే నాగుండె బద్దలైంది. జడ్జి మాటలు సూదుల్లా నాహృదయంలో జొచ్చుకుంది. ఒక కథ వ్రాసినంత మాత్రాన నాజీవితం నాశనమవుతుందని నేనెట్లా తెలుసుకోగలను. ఇంకెవరైనా అట్లా అనుకోగలరా? కాని డబ్బు మహాత్యం. అంచాలు ఏమన్నా చేస్తాయి. ఆ డబ్బే న్యాయాన్ని అన్యాయమని నిరూపించగలిగింది...... రెండేళ్లు కఠినశిక్ష...

గుండె తరుక్కుపోయింది. కార్చేందుకు కళ్ళల్లో కన్నీరుకూడ కరువయింది. పెదాలు ఎండి పోయాయి. హృదయం ఎండిపోయింది. ఈ నీచలోకంలో నా జీవితాన్ని గడిపేకంటే అంతంచేసుకుంటే మేలనిపించింది. కాని నా శాంత ఏంకానూ? వేరే దిక్కులేని ఆమె నన్ను ఒక్కక్షణమైనా వదలని నా చిన్నారి శాంత ఈ రెండేళ్ళు, నేను లేకుండా ఎట్లా జీవించగలదు? హృదయంలో ఏదో బరువు ప్రవేశించింది. చెప్పలేని ఆవేదన. శాంతను దిక్కుమాలినదానిగాచేసి, ఎట్లా జీవించగలను? ఆమె కన్నీటిధారను ఇక చూడలేకపోయాను. శరీరం బొంగరంలా గిరగిర తిరుగుతూంది. నా కళ్ళు మూతబడ్డాయి.

మళ్ళీ కళ్ళు తెరచేటప్పటికి చీకటిగదిలో నాలుగు గోడలమధ్య చింకిచాపమీద పడుకుని ఉన్నాను. ఆడదానిలా వెక్కి వెక్కి ఏడ్చాను. దేవుణ్ణి నిందించాను. న్యాయాన్ని తూలనాడాను. దీనికంతటికీ కారణం జర్నలిజం! నా జీవితాన్ని నాశనం చేసింది జర్నలిజం!!

నిమిషాలు గంటలు రోజులు నెలలు జైల్లో గడిచిపోతున్నాయి. రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. జైలునుంచి విముక్తుడనయ్యాను. జైలు గేటుదగ్గర నా శాంత నా కోసం ఎదురుచూస్తూంది. ఆమె బుజాలుపట్టుకుని ఏడ్చాను. ఎంతసేపు విలపించానో నాకే తెలవదు. ఈ రెండేళ్ళపాటు ఆమె తన మేనమామ ఇంట్లో చెప్పరాని బాధలుపడి తన దినాలను గడిపింది. ఆమె బాధలు వింటూంటే నా హృదయం ముక్కముక్కలయింది.

నా ఆఫీసరు దగ్గరకువెళ్ళి నా కష్టాలను అతనిముందు విప్పిచెప్పుకుని నౌకరీ ఇప్పించమని కోరాను. అతను జాలితో తన విచారాన్ని తెలియబరుస్తూ "కోర్టు తీర్మానం ప్రకారము నీకు ఏవిధమైనటువంటి నౌకరీ ఇప్పించలేను మూర్తీ" అని చెప్పగానే నా ఆశ అంతరించింది. ఆశఉన్న ప్రతీ చోటికి ఇరవై రూపాయలు నౌకరియైనా దొరుకుతుందేమో అని ప్రయత్నించాను. కానీ ప్రతీ చోటా నాకన్నా నిరాశయే ముందడుగు వేస్తూంది. ఆఖరుకు కథలను పంపిస్తూ వాటికి

పారితోషికం ఇవ్వమని పత్రిక సంపాదకులను కోరాను. ఎంతో ఆశతో వారిదగ్గర నుంచి జవాబుకై ఎదురుచూసాను. కానీ నాకథలు బుక్ పోస్టులో నాకు చేరిపోవడం, సంపాదకుల దగ్గరనుంచి ఏ జవాబు రాకపోవడం నా హృదయంలో మంటలు చెలరేగాయి. ఈ జర్నలిజంకి ఇంతేనా విలువ? ఓహో.

ఎటుచూసినా అంధకారం. ఎటుచూసి నా దరిద్రదేవత తన కోరలతో నన్ను పిండి చేస్తూంది. ఏమిటి చేయడం? ఎక్కడికి వెళ్లడం? ఎవరిని ఆశ్రయించడం? ఏమీ పాలుపోలేదు. సాయంకాలం స్టేషన్‌కి బయల్దేరాను. ఏదో ట్రయిన్ సిద్ధంగా ఉంది. అంతే నాకు జ్ఞాపకం. ఆ తరువాత కళ్ళు విప్పగానే నువ్వు కనిపించావు. సుధా! నా జీవితంతోపాటు ఒక అమాయకపు జీవిని, నామీద పంచప్రాణాలు పెట్టుకొని కష్టాలను ఎదుర్కొంటూ నా చిరునవ్వులకై తహతహపడే జీవిని, నా శాంతనుచూస్తూ ఎట్లా నాశనం నా చేతుల్తోనే చేయడం. సుధా! మా ఇద్దరి ప్రాణాలూ నీ పిడికిటిలో ఉన్నాయ్. వాటిని నలిపివేయడం నీచేతిలో ఉంది.” నా కథ పూర్తయింది. సుధ కళ్లల్లోకి చూశాను. ఆమె జాలిగా నన్ను చూచింది.

“మూర్తీ! అట్లాంటప్పుడు నా హృదయంలో ప్రేమజ్యోతిని ఎందుకువెలిగించావ్? ప్రతీ నిముషం నీ చక్కటి ఆకారాన్నే నా కళ్ళముందర పెట్టుకుని సంతోషంతో ఉప్పొంగిపోయేదాన్ని. నన్ను ఎంతగానో మోసం చేశావ్ మూర్తీ!” సుధ కళ్ళంట నీటిబిందువులు జలజల రాలాయి.

“పిచ్చివాడిలాఉన్న నాకు ఆశ్రయమిచ్చి రాత్రనక పగలనక కంటిమీద నిద్రలేక నాకు ఉపచారంచేసి నన్ను రక్షించావు. నా కళ్ళల్లోని మెరుపునుచూస్తూ సంతోషంతో నవ్వుకునేదానివి. ప్రతీనిముషం నన్ను వదలకుండా నాదగ్గరే ఉండి తీయగా వలపుతో మాట్లాడుతూ నిన్ను నీవు మరిచిపోయేదానివి. నన్ను ప్రేమిస్తున్నావని నీ కళ్ళు, నీ పెదిమలు నాకు చెప్పంది ఉండలేదు. అప్పటికీ నీకు దూరంగా ఉండడాన్కి చాలా ప్రయత్నించాను. ఆఖరుకు నేనొక వివాహితుణ్ణని నీతో చెప్పెయ్యాలనుకున్నాను. కాని ఆమాట నా జీవితాన్ని నాశనంవైపుకి తీసుకుపోతుందన్న భయానికి లోబడిపోయాను. నీ ఉద్దేశాన్ని మార్చడానికి నేనెంతో ప్రయత్నించాను. కానీ నీ మనసు నన్నుతప్ప అన్యులను కోరడంలేదని తెలుసుకున్నాక ఇక నా జీవితంతోపాటు నీ జీవితాన్నికూడా నాశనం చేయడం నాకు ఇష్టంలేక ఈనాడు జరిగిన జీవితాన్ని నీకు తెలియపర్చాను. సుధా! నన్ను క్షమించడం నా జీవితాన్ని నిలబెట్టడం నీ చేతులో ఉంది...” సుధ కళ్ళల్లోకి ఆశగా చూసాను. సుధ కళ్లంట నీటిబిందువులు జ ల జ ల రాలాయి.

మర్నాడు తెలిసింది సుధ తన పెద్దనాన్న ఇంటికి వెళ్ళిపోయిందని.

స్టేషన్‌నుంచి పరుగుపరుగున నా శాంతకై కాళ్ళు పరుగెత్తాయి, ఆశతో ఆనందంతో శాంతదగ్గరకు బయల్దేరాను. శాంతమేనమామ గుమ్మంలో నించున్నాడు. నన్నుచూసి పలకరించక మొహమును క్రిందికి దించుకున్నాడు. “శాంత కులాసాగా ఉందా?” అని ఆత్రతతో అడిగాను. అతను నా మొహంలోకి తీక్షణంగాచూసి, “నీ శాంత! ఇన్నాళ్ళు నీశాంత ఏలాగుందో ఎక్కడఉందో, ఏలా బ్రతికిందో నీకు అవుసరం లేకపోయిందేం? ఏదో సంపాదిస్తున్నావని పెళ్ళాన్ని పోషించుకోలేని అసమర్థుడవుకావని దాన్ని నీ మెడకు అంటగట్టారు. వీళ్ళమీదరాసి, వాళ్ళమీద రాసి సంఘాన్ని విమర్శిస్తూ, సంఘం పెద్దలు చందా డబ్బును ఎగగొట్టున్నారని పుస్తకాలలో రాస్తూ ఏడ్చావు. ఎవరిముందర నువ్వు బ్రతకాలో వారినే వాళ్లకళ్లనే వేళ్ళతో పొడుస్తుంటే ఎవరూరకుంటారు. నీ జీవితం నాశనం అయింది. నీతోపాటు శాంతనుకూడా నాశనం చేశావు. జైల్లోంచి ప్రాణాలతో బైటపడ్డావని శాంత ఎంతో ఆనందించింది. నీగురించి తను మొట్టెత్తడానికికూడ వెనుదీయలేదు. అటువంటి శాంతమూర్తిని వదిలిపెట్టి మళ్ళీ పరారి అయావు. నీ గురించి శాంత ఎంతగా విలపించిందో ఆమెగుండెలు ఎంతగా తరుక్కుపోయాయో నీకేం తెలుసు? పాపం ఆ అభాగిని ఏడ్వలేక నవ్వుతూ తన గ్రుక్కెడు ప్రాణాలను విడిచిపెట్టింది.”

గుండె ఝల్లుమంది. శాంత ఈ లోకాన్ని విడిచిపోయిందని వినగానే నా గుండె ఆగినట్లయింది.

———

